మహిళా సాధికారతే లక్ష్యం

- ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్
- వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కు పంపిణీ



కైకలూరులో వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: పేద అక్క చెల్లెమ్మల సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు వెలుగు కార్యాలయంలో వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ చెల్లింపు నమూనా చెక్కును మహిళలకు శుక్రవారం అందించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డ్వాక్రా సంఘాలకు బటన్ నొక్కి ఆర్థిక సాయాన్ని అందించిన కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 5,680 డ్వాక్రా గ్రూపులకు రూ.7,22,31,000 జమ చేశారన్నారు. గతేడాది నియోజకవర్గంలో రూ.4,63,17,000 జమ చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పొదుపు సంఘాలకు వడ్డీ భారం పడకుండా వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో రీయింబర్స్ చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరో పర్యాయం వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాలు మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు నంబూరి శ్రీదేవి, కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యురాలు బోడిచర్ల స్వాతి, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, ఏపీఎంలు సత్యనారాయమణ, రాజేశ్వరి, రవికుమార్, జేఆర్పీ ఎం.గణపతి, మండల సమైఖ్య అధ్యక్షులు సునీత, జ్యోతి, కల్యాణి, సీసీలు మాధవి, కల్పన, బాపమ్మ, విజయలక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



కైకలూరులో అవగాహన కల్పిస్తున్న సామాజిక సేవా కార్యకర్తలు

కైకలూరు: మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని డాన్ బోస్కో నవజీవన్ బాలభవన్ కైకలూరు కో ఆర్డినేటర్ టి.లీలావతి, సామాజికవేత్త ఎల్.ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక యానాదుల కాలనీలో శుక్రవారం పిల్లల చదువు, గృహహింస, మత్తు పదార్థాల దుర్వినియోగం, బాల్య వివాహాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కాలనీలో సంస్థ తరఫున ఉచితంగా ఏర్పాటు చేసిన ట్యూషన్‌కు పిల్లలందరినీ రోజూ పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సామాజికవేత్త టి.అప్పారావు, కాలనీ నివాసితులు అమ్మాజీ పోలమ్మ, నాగమణి, రాజు, యేసు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



పమిడిముక్కల: విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరమని ఉయ్యూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్ అన్నారు. కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు కావలసిన స్కిల్స్ నేర్చుకోవడంలో శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎండీ రియాజ్, హెచ్‌ఎం ఎం.ప్రభాకరరావు, ఎంఎస్‌ఎంఈ సలహాదారు పినమాల నాగకుమార్, సర్పంచ్ బుల్లా నాగమణి, ఎంపీటీసీలు అంకకుమారి, రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొణతం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రెండో శనివారం సందర్భంగా సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరారు.

పమిడిముక్కల: పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కై కలూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం కైకలూరు మండలం (కైకలూరు టౌన్ సెక్షన్), మండవల్లి మండలం (పెరికెగూడెం) సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి.రామకృష్ణ శుక్రవారం చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ దేశభక్తి ఉండాలి



గోనెపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు



స్వాతంత్య్ర సమరయోధులను సత్కరిస్తున్న ఎంపీపీ



వల్లూరుపాలెంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి



పమిడిముక్కలలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌డీఓ నాంచారరావు, ప్రజాప్రతినిధులు



రాపర్ల కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూపరాణి, తదితరులు

కైకలూరు: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని ఎన్నటికీ మరువరాదని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గోనెపాడు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతరం ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు. త్యాగధనులను స్మరించుకుందాం, స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దాం... పుడమి తల్లిని కాపుడుకుందామంటూ నినదించారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ బత్తిన శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి జె. కుమారస్వామి, నాయకులు డాక్టరు పిండి ప్రసాదరావు, బత్తిన లక్ష్మి, బత్తిన జ్యోతి, వీరమళ్ల వెంకటేశ్వరరావు, గుమ్మా రాము, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించే గుణాన్ని కలిగి ఉండాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో సచివాలమం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహనీయుల స్థూపాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇరువురు స్వాతంత్య్ర సమరయోధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనగాని వెంకటరమణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే వెంకటరామాంజనేయులు పాల్గొన్నారు.

మహనీయులు మనకు ఆదర్శం..

మండలంలోని మోటూరు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరగంటి పద్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. చిరిచింతల, నూజేళ్ల గ్రామాల్లో ఎంఈవో శేఖర్‌సింగ్, శేరీగొల్వేపల్లి గ్రామంలో పంచాయతీరాజ్ ఏఈ, శేరీదింటకుర్రు గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.అనంతలక్ష్మి గ్రామాల్లో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని చింతపాడులో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. నా భూమి–నాదేశం కార్యక్రమం ద్వారా నేల తల్లికి మొక్కాలని ఎంపీడీఓ సీకే వెంకటరమణ పేర్కొన్నారు. వీరులకు వందనం అర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మొక్క నాటారు. ఈఓపీఆర్డీ బీ ఆనందబాబు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: స్వాతంత్య్ర పోరాట సంగ్రామంలో అసువులుబాసిన అమరుల త్యాగాలను ఎన్నటికీ మరువబోమని ఎంఈవో జి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వల్లూరుపాలెం, రొయ్యూరు గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వల్లూరుపాలెంలో ఎంఈఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొనకాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కాసరనేని అనూరాధ జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించటంతోపాటు మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి ఓగిరాల తిరుమల వెంకటరత్నం పాల్గొన్నారు. రొయ్యూరులో సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, పీఆర్ ఏఈఈ రాఘవరావు జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల శిలాఫలాకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. సచివాలయ కార్యదర్శి చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాపర్ల(పామర్రు): మండలంలోని రాపర్ల సచివాలయం వద్ద నా భూమి–నాదేశం కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నందివాడ మండలం పెదవిరివాడ, ఒద్దులమెరక గ్రామాల్లో శుక్రవారం నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంకోసం ప్రాణం పెట్టిన అమర వీరులను స్మరించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సచివాలయాల వద్ద మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. పెదలింగాల సర్పంచ్ కలపాల సుధారాణి, ఒద్దుల యెరక సర్పంచ్ తోట గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టి సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. అమరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీడీఓ సీహెచ్ విఠల్ పాల్, సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మంటాడలో సర్పంచ్ నందమూడి వీరమ్మ, ఎంపీటీసీలు మేరుగ లక్ష్మి, మేరుగ రాజ్యలక్ష్మి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పమిడిముక్కలలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాంచారరావు, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, హెచ్‌ఎం కేశవనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సి సురేష్ దంపతులు మొదటి జెండాను తీసుకున్నారు. జాతీయ పతాకాలు పోస్టాఫీసులో ఉంచారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ సురేష్, స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐక్య వేదిక సమావేశం రేపు

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్‌లోని టైప్ అండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సమాచార హక్కు పరిరక్షణ ఐక్య వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు మండల అధ్యక్షుడు టి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి మార్కురాజు శుక్రవారం పేర్కొన్నారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. స్టాంప్ సైజ్ ఫొటో తీసుకురావాలని సూచించారు.

1వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం

మండవల్లి: మండలంలోని సింగనపూడి గ్రామ పంచాయతీలో 1వ వార్డు సభ్యురాలిగా వీ సునీత ఏకగ్రీవం అయినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 7న ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఒడుపు సునీత ఒక్కరే నామినేషన్ వేసినట్లు స్టేజ్ –1 ఆఫీసర్ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ పరిశీలన అనంతరం ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్ విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ గుర్తింపు కార్డులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య మాట్లాడుతూ తన సతీమణి కొనకళ్ల వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం బస్సు పాసు వినియోగించే 100 మంది విద్యార్థులకు రూ.50 విలువచేసే గుర్తింపు కార్డులను ట్రస్ట్ ద్వారా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టీఎంఈ రాణి, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, సామి రామ్మోహనరావు, తిరివీధి శ్రీరాములు, ఎం రామకృష్ణ, రామలింగేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకం సాధించిన విద్యార్థి బి.జస్వంత్ అభినందన కార్యక్రమం శుక్రవారం కేకేఆర్ గౌతమ్ హైస్కూలులో నిర్వహించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యరామ్ మాట్లాడుతూ ఈనెల 5, 6 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 21వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో తమ విద్యార్థి బి.జస్వంత్ పాల్గొని తృతీయ స్థానం సాధించారన్నారు. సౌత్ ఇండియా పోటీలకు అర్హత పొందాడని తెలిపారు. విద్యార్థి జస్వంత్, కోచ్ ఎస్ వెంకటేశ్వరరావులను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. ప్రిన్సిపల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



గుడివాడ టౌన్: గ్రంథాలయాల అభివృద్ధిలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథమ్ చేసిన కృషి చిరస్మరణీయం అని ఏఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. కళాశాల సమావేశ హాలులో శుక్రవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. తొలుత కళాశాల యాజమాన్యం రంగనాథమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, కేబీఎన్ కళాశాల లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, గ్రంథాలయ అధికారిణి బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముదినేపల్లి రూరల్: స్థానిక సచివాలయం వద్ద శనివారం ఉదయం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు శిబిరం నిర్వాహకులు పేర్నీడు హనుమార శుక్రవారం తెలిపారు. విజయవాడకు చెందిన అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గుండె, నరాల సంబంధిత వ్యాధులు, ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్ వంటి వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలంటీర్ల నియామకం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ముదినేపల్లి, దేవపూడి సచివాలయాల పరిధిలో ఖాళీ అయిన వలంటీర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎంపీడీవో పీ మల్లీశ్వరి, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, ఎంపీటీసీల సభ్యులు జంపాన కోటయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, దేవపూడి సర్పంచ్ దాసరి అన్నపూర్ణవిఠల్, పెయ్యేరు వైస్‌సర్పంచ్ దివి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష



విద్యాశాఖపై సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. కైకలూరు కార్యాలయంలో వ్యవసాయం, విద్యా, వైద్యం, పశుసంవర్థక శాఖల పనితీరుపై నియోజకవర్గ సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి, కలెక్టరుతో నియోజకవర్గ అభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తున్నారని అన్నారు. ఆయా శాఖల పరంగా కావల్సిన మౌలిక సౌకర్యాలు, ఇతర అంశాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఫిషరీస్ ఏడీ షేక్ చాన్‌బాషా, వ్యవసాయశాఖ ఏడీలు జి.గంగాధరరావు, వెంకటమణి, పశుసంవర్థక శాఖ ఏడీలు పఠాన్ ముస్తాఫఖాన్, వరప్రసాద్, డాక్టర్లు ప్రహర్ష ధనశ్యామ్, ఫణీంద్రబాబు, నాగేంద్రవర్మ, రామకృష్ణ, సూర్యకుమారి, ఎంఈవోలు రామారావు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వైద్యులు హేమలత, కిరణ్, శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో చేపల చెరువులు వద్దు

ఆర్డీవోకు బాధితుల వినతి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గుడివాడ టౌన్: నందివాడ మండలం తమిరిశ గ్రామ శివారు అంకన్నగూడెం దళితుల నివాసాలను ఆనుకుని చేపల చెరువులు ఏర్పాటును ఆపేయాలని గ్రామ వాసులు ఆర్డీఓ పి.పద్మావతిని కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపి ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.రఘు మాట్లాడుతూ 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ గ్రామానికి చెందిన సుమారు 70 పైబడి కుటుంబాలు ఇందిరమ్మ కాలనీల పేరుతో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి దానిని మెరక చేసే విషయంలో అడ్డంకులు వస్తూనే ఉన్నాయన్నారు. అక్కడ చేపల చెరువులు తవ్వడాన్ని గ్రామస్తులు అడ్డుకుంటూ వచ్చారని, ఈ ఏడాది మత్స్యశాఖ నుంచి చెరువులు తవ్వకానికి అనుమతులు వచ్చిన నేపథ్యంలో భూ యజమానులు చెరువు తవ్వడం దుర్మార్గం అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దళితులకు అన్యాయం జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, గ్రామస్తులు, గంటా దాసు, ఐ. విజయకుమారి, తులిమిల్లి నీలావతి, నీలాంబ్రమ్, మోషే, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రోన్ల సరఫరాకు అవకాశం

పామర్రు ఏడీఏ స్వర్ణలత



మాట్లాడుతున్న ఏడీఏ స్వర్ణలత

పామర్రు: ప్రభుత్వం డ్రోన్‌లను సబ్సిడీపై రైతులకు అందజేస్తోందని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో సహాయ పడే డ్రోన్‌ల కోసం రైతులు సంఘాలుగా ఏర్పడి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పామర్రు మండలానికి మూడు డ్రోన్‌లను మంజూరు చేశామని తెలిపారు. ఒకొక్క డ్రోన్‌ను 40 శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. మిగిలిన 60 శాతం బ్యాంకుల ద్వారా రుణం పొందవచ్చని చెప్పారు. మండలంలోని రైతులు ఐదుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శివనాగరాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వర్షంతో రైతుల హర్షం

పామర్రు: గత ఐదు రోజులుగా తీవ్రమైన ఎండ ప్రభావంతో ఉక్కపోతకు గురైన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షాలకు కొంత ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం ఉంది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి మబ్బులు కమ్మాయి. తర్వాత వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కొన్ని చోట్ల మెరక వరి పొలాలలకు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు వర్షం రాకతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండవల్లి: మండవల్లి, పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వరినాట్లు వేసిన ప్రస్తుత తరుణంలో పొలాల్లో నీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు వర్షం ద్వారా వెసులుబాటు కలుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. రహదారులపై వర్షం నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వీపులో దిగిన తాటిపేడు తొలగింపు

కై కలూరు: ప్రమాదవశాత్తూ యువకుడు కుడివైపు వీపుపై దిగిన తాటిపేడును కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టరు దుర్గాప్రసాద్ తొలగించారు. మండవల్లి మండలం చావలిపాడుకి చెందిన పి.సతీష్ (15)కు తాటిపేడు శుక్రవారం వీపుపై దిగింది. వెంటనే గ్రామానికి చెందిన కుర్రేళ్ల అనిల్‌కుమార్ సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టరు దుర్గాప్రసాద్ సతీష్‌కు ధైర్యం చెప్పి తాటి పేడును తొలగించారు. స్టాఫ్ నర్సులు వై.లక్ష్మి, ఈ.అనురాధ సహాయం చేశారు.

27న జిల్లా స్థాయి భజన పోటీలు

గుడివాడ టౌన్: స్థానిక శ్రీ దారకా సాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న జరిగే ఈ భజన పోటీల్లో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మూడు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. గీతాభవన్ రోడ్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 91005 56016, 93942 21226ను సంప్రదించవలసిందిగా కోరారు.

నామినేషన్ల పరిశీలన

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు సర్పంచ్, పెయ్యేరు 2వ వార్డు సభ్యుడి ఉప ఎన్నికలకు సంబంధించినామినేషన్లన్నీ సక్రమంగా ఉన్నట్లు ఎంపీడీవో పీ మల్లీశ్వరి తెలిపారు. వణుదుర్రు సర్పంచ్ పదవికి 9 నామినేషన్లు దాఖలు కాగా రిటర్నింగ్ అధికారి షేక్ జరీనా వీటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నట్లు తెలిపారన్నారు. పెయ్యేరు వార్డు సభ్యుని పదవికి 3 నామినేషన్లు దాఖలు కాగా ఇవి కూడా సక్రమంగా ఉన్నాయన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామానికి చెందిన వీర్ల అప్పారావు పూరిల్లు కాలిపోయింది. దీంతో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు బాధితుడికి పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ గోళ్ళ వెంకటేశ్వరరావు శుక్రవారం నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. ఎంపీటీసీ వెలగల పద్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కంభం డేవిడ్, కాటూరి అశోక్ తదితరలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ముదినేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పంచాయతీల పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వివిధ అంశాలు, పలుశాఖల పనితీరుపై చర్చించారు. జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో పీ మల్లీశ్వరి, హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, వైస్‌ఎంపీపీ రాచూరి రాధ, తహసీల్దార్ కే శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీల సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

గుడివాడ టౌన్: ప్రముఖ రచయిత రాఘవ కేదారి రచించిన శ్రీ నందమూరి తారకం (ఎన్టీఆర్ శతకం) పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీ చౌక్ లోని ఆర్య వైశ్య సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. కవులు, రచయితలు పాల్గొనవలసిందిగా నిర్వాహకులు కోరారు.